# నిద్రరాని రాత్రి

అర్ధరాత్రి దాటింది అయినా నాకు నిద్ర పట్టలేదు. ఆ గది నాకు అలవాటైనదే. కొన్ని పరిశ్రమలకు, వ్యాపార సంస్థలకు అధిపతి కావడం వల్ల ఎన్నో సమస్యల్లో మునిగి తేలుతూ రోజులు గడిపే నేను, నాలుగు రోజులు ప్రశాంతంగా గడపడం కోసం అప్పుడప్పుడు, ఆ ఊరు వెళ్తూ ఉంటాను. వెళ్లినప్పుడల్లా ఆ గదిలోనే ఉంటాను.

గదిలో 'ఏ.సి'. బాగానే పని చేస్తోంది. గది చల్లగానే ఉంది. పడుకునే ముందు అలవాటుగా పుచ్చుకునే మోతాదు 'వైను' పుచ్చుకున్నాను. నిద్రమాత్రలు కూడా వేసుకోవడమైంది.

ఇంటి నుండి రావలసిన ఫోనులు వచ్చేశాయి. అందరూ బాగానే ఉన్నారు. నా ఆధీనంలో వుండే పరిశ్రమల నుండి, వ్యాపార సంస్థల నుండి ప్రతి రాత్రీ అందవలసిన నివేదికలు కూడా అందాయి. ఎక్కడా ఏ సమస్యా లేదు.

అయినా నిద్ర రావడంలేదు.

మనసులో ఏదో అలజడి... ఆందోళన...

మంచం మీద లేచికూర్చున్నాను. గది అంతా ఒకసారి కలియచూశాను. మసక వెలుతురు నిండిన గది, కారణం తెలియని ఆందోళనకు గురైన నా మనసులా తోచింది.

లేచి, కాసేపు గదిలో అటూ, ఇటూ నడిచాను. కిటికీ వద్దకు వెళ్లి కిటికీ తెర కొద్దిగా తొలగించి చూశాను.

అర్ధరాత్రి దాటినా, జనంతో, వాహనాలతో కళకళలాడుతోంది రోడ్డు. 'బార్లు' రెస్టారెంటులు ఇంకా తెరిచి ఉన్నాయి. డబ్బు వాత తగిలిన మనుషులు నిప్పు తొక్కిన కోతుల్లా చిందులు వేస్తున్నారు. ఆశ్చర్యంగా చూస్తూ నించున్నాను. పూర్వం ఆ ఊరి రోడ్లు ఇంత రద్దీగా ఉండేవి కావు. చీకటి పడగానే రోడ్లు నిర్మానుష్యంగా మారేవి. గత

రెండేళ్లుగానే ఈ మార్పు.

అవును మరి; జేబుల్లో డబ్బులాడుతున్నాయి కదా! జేబులోని డబ్బు ఖర్చు చేసేంత వరకు మనిషికి నిద్ర పట్టదు కదా! డబ్బు ఆర్జించడానికి, ఆర్జించిన డబ్బు ఖర్చు చేయడానికి తీసే పరుగేగా సగటు మనిషి జీవితం!

చూస్తూ నిలబడలేకపోయాను. ఎందుకో మనసు అస్వస్థంగా ఉంది. కిటికి తెరవేసి, కాలు కాలిన పిల్లిలా, గదిలో అటూ, ఇటూ తిరిగాను.

రాత్రి జరిగిన పార్టీలో కూడా మామూలుగా, నా సహజ ధోరణిలో గడపలేక పోయాను. కోట్ల ఆదాయం కలిగినవాడ్ని. ఏ ఊరు వెళ్ళినా, కొందరు మిత్రులు చిన్న తరహా వ్యాపారవేత్తలూ, పారిశ్రామిక వేత్తలు కలుస్తారు. పార్టీలంటూ తనను పొగుడుతూ, అర్ధరాత్రి దాకా భజన చేస్తారు. పార్టీ పేరుతో పొగడ్తల్లో ముంచేస్తే, ప్రసన్న వదనుడై సహాయం అందిస్తానని అనుకుంటారు, పాపం అమాయకులు! నావద్ద నుండి సహాయం అందడం వైశాఖంలో వాన కురవడం కన్నా కష్టమని వాళ్లకు తెలియదు కదా!

సాధారణంగా పార్టీలో బాగానే మాట్లాడుతాను. ఛలోక్తులు కురిపిస్తాను. ప్రతి ఒక్కరినీ పలకరిస్తాను. ఎదుటి వాడి వ్యాపార రహస్యాలు తెలుసుకుంటాను. రెట్టింపు లాభాలు రావాలంటే ఎక్కడ పెట్టుబడి పెట్టాలో పసికడతాను. మఱ్ఱి చెట్టు క్రింద మొక్కలా, నా మిత్రమండలిలోని ఎవ్వరూ ఎదగరు; ఎదగకూడదు కూడా–

గది మూలలో వుండి ఫ్రిజ్ తలుపు తెరచి 'వైన్' సీసా అందుకున్నాను. గ్లాసులోకి వైను పోసుకున్నాను. ఆ రోజు తీసుకోవలసిన మోతాదు అప్పటికే తీసుకొని వున్నా, అలవాటుకు విరుద్ధంగా గ్లాసు అందుకున్నాను. మెల్లమెల్లగా 'వైన్' చుక్కలు చప్పరిస్తూ వుంటే ఆ రోజు జరిగినదంతా ఒక 'సినిమా రీల్'లా మనసులో కదిలింది.

అవునవును! నాకు హఠాత్తుగా గుర్తుకొచ్చింది మధ్యాహ్నం భోజనానికి వెళ్లినప్పుడే అది జరిగింది. ఈ ఆందోళన మొదలైంది. సాధారణంగా రెస్టారెంటుకు వెళ్ళను కానీ ఆరోజు ఎందుకో మనుషుల ముఖాలు చూడాలని అనిపించింది; రెస్టారెంటుకు వెళ్లాను.

రెస్టారెంటు నిండా జనం– పంచనక్షత్ర హోటల్లోని రెస్టారెంటు కూడా ఇంత రద్దీగా ఉంటుందని అనుకోలేదు. వెంటనే మా మేనేజరు మాట గుర్తు వచ్చింది.

"ఇప్పుడు పూర్వంలా కాదు, సర్. జనం చేతుల్లో డబ్బులాడుతున్నాయి. తమ చిన్నప్పటిలా, ఈ కాలం కుర్రవాళ్లు పొదుపు చేయరండి. చేతిలో ఇలా డబ్బు పడితే అలా ఖర్చు చేస్తారండి. అందువల్ల వాళ్ల చేతిలో పడిన డబ్బు వెంటనే లాగేసుకోవాలి. అందుకే అందుకు పనికి వచ్చే వ్యాపారాలు కూడా మొదలుపెట్టాలి. ఆ విషయం మీకు బాగా తెలుసు, అయినా ఒకసారి..."

నిజమే! ఆరునెలల క్రితం కన్నా ఎక్కువ ఇప్పుడు డబ్బు ప్రవహిస్తోంది. ఆ మాట హోటల్ మేనేజర్ కూడా ఒప్పుకున్నాడు. "మీకు తెలుసుగా ఆరేళ్ళైంది హోటల్ కట్టి. ఇప్పుడిప్పుడే పికప్ అవుతోంది"

"అలాగా! అయితే ఇప్పుడు హోటల్ బిజినెస్ బాగుందన్న మాట" నర్మగర్భంగా అడిగాను.

"బాబు బాబు.. తమరు మా పొట్ట కొట్టేయకండి ఈ హోటల్ బిజినెస్ మాకు వదలండి సార్".

ముందుకు నడిచాను. రెస్టారెంటులో కూర్చుని వుండే సూటు బూటూ ధరించిన వారు నన్ను వింతగా చూశారు. బహుశా నేను ధరించిన ముతక పంచా, లాల్చీ కాళ్ళకు వేసుకున్న 'కిర్‌కిర్'మని సవ్వడి చేసే కిర్రు చెప్పులు దానికి కారణం కావచ్చు.

భోజనం 'ఆర్డర్' చేసి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను.

"నమస్కారం సర్"

ఉలిక్కి పడ్డాను. తలెత్తి చూశాను.

అంత ధైర్యంగా నన్ను పలకరించిన వాడెవడని ఆశ్చర్యబోయాను కూడా.

ఎదురుగా నిలబడి వున్నాడు ఒక యువకుడు.

"తమరు నన్ను గుర్తించినట్టు లేదు..."

'అవును' అన్నాడు.

"మాదీ తమ ఊరేనండి. నేను రామయ్య కొడకునండి. మా అయ్య, మీ దివాణం లోనే..."

ఏ రామయ్య? నాకు ఎవ్వరూ గుర్తురాలేదు.

నాన్నగారు ఉండేటప్పుడు ఊరులో వున్నవాళ్ళందరూ దివాణంలోనే ఏదోపని చేసేవారు. అప్పుడు ఊరు పట్నంగా ముస్తాబు కాలేదు కదా! ఇప్పుడైతే కొందరు నగరంలోనూ, పై ఊళ్లల్లోనూ పని చేస్తున్నారు. ఊర్లో కార్లు తిరుగుతున్నాయి. టి.వీలు, ఏ.సీలు... కొన్ని చిన్నతరహా పరిశ్రమలు... ఆ మార్పు ముందుగానే గమనించి టీ.వీలు, ఏ.సీలు. తయారుచేసే కర్మాగారాలు నెలకొల్పాను. అంతేకాదు అవి కొనడానికి కూడా అన్ని ఊళ్ళల్లోను ఏర్పాటు చేశాను. సగటు మనిషి చేతికి అందిన డబ్బు అక్కడ పెరగకుండా నా చేతిలో వచ్చి చేరాలనేది నా జీవితాశయం.

"నువ్వు... ఇక్కడ... ఏదైనా ఉద్యోగమా..?" కాసేపు పోయాక అడిగాను.

"కాదు సార్. ఊరు చూడడానికి వచ్చామండి. ఇదిగోనండి ఇది నా పెళ్ళాం" పక్కనే నిలబడిన యువతివైపు తిరిగి అన్నాడు. "ఇది మైసూరు, బెంగుళూరు తిప్పమని

పోరుతుంటే”

“అలాగా...” ఒకసారి ఆమెను పరిశీలనగా చూశాను. మంచి పట్టుచీర కట్టుకుంది ఆమె. చేతులకు బంగారు గాజులు; మెడలో దుక్కటి బంగారు గొలుసు-

“ఊరిలో ఏ పని చేస్తున్నావు?” అడిగాను.

“ఒక చిన్న దుకాణం ఉందండి”

“ఏమి అమ్ముతావు?”

“అదీ ఇదీ అని లేదండి. జనానికి ఏం కావాలంటే అదే అమ్ముతానండి. గుండు సూదుల దగ్గర నుండి ప్రెషర్ కుక్కర్ దాకా... ఉప్పు పప్పుల నుండి ఊరగాయల దాకా...”

“వ్యాపారం బాగుందా?”

“ఏదో మీ దయ వల్ల ఇప్పుడు సుమారుగా ఉందండి. మన ఊరిలో కూడా ఇప్పుడు కొనేవారు పెరిగారు కదండి...”

అర్థవంతంగా మూలిగాను.

“ఇక్కడ ఎక్కడ ఉంటున్నావు...?”

“ఈ హోటల్ లోనేనండి”

రూం నెంబరు చెప్పాడు.

నా గుండె జారిపోయింది. వీడు నాపక్క గదిలో ఉన్నాడా...? చిల్లర సామానులు అమ్మి ఇంత డబ్బు సంపాదించాడా...?

నా మనసులో ఏదో అలజడి...

కూర్చోలేకపోయాను లేచి గదిలో గబగబా అటూ ఇటూ నడిచాను. చివరికి సెల్‌ఫోన్ అందుకున్నాను.

అర్ధరాత్రి దాటిందనేది కూడా పట్టించుకోకుండా ముఖ్య కార్యదర్శికి ఫోను చేసి గంటకిపైగా మాట్లాడాను. ఆ తరువాత తేలికగా ఊపిరి పీల్చి మంచం మీద వాలాను. గుండె మీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోయాను.

***

ఫలితం-రాజుగారు తలిస్తే దెబ్బలకు కరువా... ఆరు నెలలు తరువాత...

ఊరి సెంటర్‌లో రోడ్డువారగా నిలబడి తరాలు చూసిన మామిడి చెట్టు నరికి వెయ్యబడింది. వసంతం వచ్చినప్పుడైనా కొత్త చిగురు తిని ఆనందగీతాలు ఆలపించిన కోకిలలు నిరాశ్రయులై ఎగిరిపోయాయి. చెట్టునీడలో చిల్లర సామానులు అమ్మి బ్రతికే

తోపుడు బళ్లువారు తమ బళ్లు తోసుకుంటూ దూరంగా వెళ్లిపోయారు.

చూస్తూ వుండగానే అక్కడ దెయ్యంలా ఒక మూడంతస్తుల మేడ లేచింది... రంగురంగుల విద్యుత్తు దీపాల వెలుగుల చిరునవ్వుతో ఒక యక్షిణిలా జనాన్ని ఆకర్షించింది.

ఇప్పుడు అగ్గిపెట్టె కావాలన్నా జనం అక్కడికే...

రామయ్య కొడుకు దుకాణం మూత పడింది. వ్యాపారం కోసం చేసిన అప్పు తీర్చలేక ఇల్లు అమ్మవలసివచ్చింది. పెళ్లాం పోరు భరించలేక అప్పుచేసి మైసూరు వెళ్లినందుకు స్వయంగా తిట్టుకున్నాడు అతడు.

***

ఇప్పుడు, సంతోషంగా సంతృప్తిగా గుండెలమీద చేతులు వేసుకొని నిద్ర పోతున్నాను.

***